మన విదేశాంగ విధానాన్ని మార్చాలి

- భారత ప్రతిష్టను పునరుద్ధరించాలి
- కేంద్రానికి సిపిఎం డిమాండ్
- అదానీ డ్రోన్‌లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయకుండా ఆపాలి
- ధర్నాలో ఎస్ వీరయ్య



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు తన విదేశాంగ విధానాన్ని మార్చుకుని, భారతదేశ ప్రతిష్టను పునరుద్ధరించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఇజ్రాయిల్‌కు అదానీ ఏరో అండ్ డిఫెన్స్ కంపెనీ హెర్మస్ 900 అనే డ్రోన్లను సరఫరా చేయడాన్ని నిరసిస్తూ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్‌లో గల అదానీ మిస్సైల్ భవనం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్ల ఎగుమతిని నిలిపివేయాలని నినదించారు. భారత ప్రభుత్వం కపటత్వం విడనాడాలి బ్యానర్లను ప్రదర్శిస్తూ గంటకుపైగా నిరసన తెలిపారు. ప్రపంచశాంతిని కాపాడాలి, ప్రధాని మోడీ వైఖరిని మార్చుకోవాలి, మోడీ అవలంభిస్తున్న విదేశాంగ విధానం నశించాలి. సామ్రాజ్యవాదం నశించాలి, సోషలిజం వర్ధిల్లాలి, యుద్ధం వద్దు-శాంతి ముద్దు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలిపివేయాలంటూ ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య మాట్లాడుతూ ప్రపంచశాంతికి హానికరంగా తయారైన ఇజ్రాయిల్ పాలకులు పాలస్తీనా ప్రజలను ఊచకోతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కేవలం ఇజ్రాయిల్-పాలస్తీనాలకే పరిమితం కాకుండా ఇరాన్ తదితర దేశాలను యుద్ధంలోకి లాగుతూ ప్రాంతీయ యుద్ధంగా మారుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏండ్ల తరబడి ఇజ్రాయిల్, పాలస్తీనా భూభాగంలో ఆక్రమణకు తెగపడుతున్నదని విమర్శించారు. భారతదేశం ఎప్పుడూ పాలస్తీనా వైపే నిలబడిందని, అయితే మోడీ అధికారంలోకి వచ్చాక తన విదేశాంగ విధానాన్ని మార్చారని తెలిపారు. మొదట్నుంచి పాలస్తీనాకు మద్దతుగా నిలబడిన మన ప్రతిష్టను దిగజార్చారని చెప్పారు. మారణ హోమానికి అండగా నిలబడటం అమానవీయమని తప్పుబట్టారు. మొదట్నుంచి మోడీ సర్కారుకు అదానీ, అంబానీలు కుడి, ఎడమ భుజాలుగా ఉన్నారని, వారు వ్యాపారం చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే అదానీ సరఫరా చేస్తున్న డ్రోన్‌లతో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై దాడికి పాల్పడుతుందని తెలిపారు. అందుకే అదానీ డ్రోన్లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయడం నిలిపివేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు వివరించారు. మోడీ ప్రభుత్వం డ్రోన్ల సరఫరాపై నిషేధం విధించి, పాలస్తీనాకు, మైనార్టీల హక్కులకు అండగా నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు సహకరించడం మానుకోవాలని, పాలస్తీనాపై దాడులను ఖండించాలని, ఐక్యరాజ్యసమితిలో వెనుకబడిన దేశాలను కూడగట్టి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు.

ఒకప్పుడు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడి పాలస్తీనాపై దాడులను ఖండిస్తుంటే, సిఎం రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదని వీరయ్య ఈ సందర్భంగా హితవు పలికారు. నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ కలిసి రావాల్సిన తరుణంలో పోలీసులు శాంతియుతంగా ధర్నాకు కూడా అనుమతి ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చెప్పే దాన్ని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయాలని సూచించారు. ప్రపంచశాంతి కోసం ఉద్దేశించిన ధర్నాకు అనుమతి ఇవ్వరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒకలా, సీఎం రేవంత్ రెడ్డి మరొకలా చెప్పడం అవకాశవాదమే అవుతుందని విమర్శించారు. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 43 వేల మంది చనిపోగా, లక్షల మంది గాయాలపాలయ్యారని, పది లక్షల మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రులు ధ్వంసమై ఆకలి చావులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ అదానీతో డ్రోన్లను సరఫరా చేయిస్తున్నదని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాల సరఫరా చేసే విధానాన్ని సిపిఎం వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచశాంతిని కోరే వారందరూ పాలస్తీనాకు మద్దతివ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షపార్టీలు ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షను వ్యతిరేకించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య జగదీష్, మధుసూదన్ రెడ్డి, కవిత, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మూడ్రోజులపాటు జరిగే ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఐద్వా జాతీయ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు బృందా కరత్ ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు.

-వార్త మెయిన్ పేజీలో

రూ.21.56 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు

- డిసెంబర్ 9లోగా రైతులందరికీ రుణమాఫీ..
- మంత్రి దనసరి అనసూయ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు సిఆర్ఆర్, ఎంఆర్ఆర్ కోటాలో రూ.21.56 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 9లోగా రూ.2 లక్షల రుణమాఫీని రైతులందరికీ మాఫీ చేస్తామని తెలిపారు. మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో పాటు సిఎస్ఆర్ నిధులతో జిల్లాలోని వెంకటాపూర్ జెడ్‌పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల్లో రోడ్ల మరమత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన పరిజ్ఞాన విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని అన్నారు. ములుగు జిల్లాలో 176 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చామని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడానికి సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా పంట పొలాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆస్పత్రుల భవనాల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వలేదని, దాంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా కంటైనర్ పాఠశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంచర్ల గ్రామ సమీపంలో రూ.125 కోట్లతో ఇంటి గ్రేటెడ్ పాఠశాల కు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. ములుగు నియోజకవర్గం 75 శాతం అటవీ ప్రాంతం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నదని, దీనిపై తాను స్వయంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

'రైతు భరోసా' ఎక్కడ?

- ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేయాలి
- మహిళలకు ఇస్తామన్న రూ.2500 అందించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని వాగ్దానం చేసిందని, కానీ ఇప్పుడు దాన్ని అమలుచేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మహిళలకు ఇస్తామన్న రూ.2500ల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు వాగ్దానాలు చేసిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యం చెందారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీకి ఎక్కడా సంపూర్ణంగా జరగలేదని, అర్హత ఉండి కూడా మాఫీ కానీ రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గొప్పలు చెబుతున్నా.. అదనంగా బస్సులు నడపకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అవినీతిని అరికట్టాలని, జల సంరక్షణ కోసం రాష్ట్రంలో ఏర్పాటయిన హైడ్రా దౌర్జన్యాలకు పాల్పడుతుందని తెలిపారు. మూసీ సుందరీకరణ పేరుతో దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య ప్రజలను, కార్మికులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ కట్టడాల పేరుతో దౌర్జన్యంగా కూల్చేయడం దారుణమన్నారు. హైడ్రా పేరుతో నష్టపోయిన వారికి పునరావాసం కల్పించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మెదక్ జిల్లా కార్యదర్శి ఎ మల్లేశం, కార్యదర్శివర్గ సభ్యులు కె మల్లేశం, బసవరాజు, కె నరసమ్మ, ఎ మహేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కె నాగరాజు డి మల్లేశం, బాలనర్సు, సంతోష్ పాల్గొన్నారు.

రిసాయా అకాడమీతో ఎన్ఎయు భాగస్వామ్యం

- ఆధునిక టెక్నాలజీలో నైపుణ్యాలు పెంపు

ప్రజాశక్తి - హైదరాబాద్

అమెరికాలోని భారతీయ విద్యార్థులకు టెక్నాలజీ రంగంలో ప్రత్యేక విద్యను అందించడానికి రిసాయా అకాడమీతో భాగస్వామ్యం చేసుకున్నట్లు నార్తర్న్ అరిజోనా యూనివర్సిటీ (ఎన్ఎయు) తెలిపింది. ఇందుకోసం ఐదు వారాల సమ్మర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ భాగస్వామ్యానికి మల్లారెడ్డి విశ్వవిద్యాలయంతో చేసుకున్న అవగాహన ఒప్పందంతో మరింత మంది విద్యార్థుల రాక పెరగనుందని పేర్కొంది. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్ఎయు గ్లోబల్ అఫైర్స్ అసోసియేట్ వైస్ ప్రోవోస్ట్ సీజర్ ఫ్లోర్స్, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ విఎస్‌కె రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఇంటెన్సివ్ సమ్మర్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బ్లాక్‌చెయిన్, ఎఐ, ఎంఎల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఇసిఇ) వంటి రంగాలలో డిగ్రీలు అభ్యసిస్తున్న విద్యార్థులకు క్లిష్టమైన నైపుణ్యాలను పొందడానికి వీలుందన్నారు. ఈ భాగస్వామ్యం భారతీయ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో ప్రత్యేకమైన అవకాశాలను ఇస్తుందని రిసాయా అకాడమీ సిఇఒ రితీష్ బాబు తెలిపారు. ఈ సమావేశంలో మల్లారెడ్డి యూనివర్శిటీ డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, అడ్మిషన్స్ డైరెక్టర్ శాంతి కుమార్, ఎన్ఎయు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు

- సిరిసిల్లలో యూసుఫ్‌ను విడుదల చేయాలి
- సుదర్శన్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి
- అదనపు డిజిపికి టిడబ్ల్యుజెఎఫ్ విజ్ఞప్తి



అదనపు డిజిపికి విజ్ఞప్తి చేస్తున్న టిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఎడిజిపి) మహేష్ భగవత్‌ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కార్యదర్శులు బి రాజశేఖర్, గంద్ర నవీన్, ఎస్‌కె సలీమా, బిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి తదితరులు హైదరాబాదులో ఎడిజిపిని కలిసి వినతి పత్రం సమర్పించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు మహ్మద్ యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. అతనికి సంబంధం లేని ఒక కేసులో ఆయన్ను ఇరికించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ కేసు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనీ జర్నలిస్టు యూసుఫ్‌పై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులలో శనివారం రాత్రి జర్నలిస్టు సుదర్శన్‌పై దుండగులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారనీ, వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని, మరోవైపు కొందరు పోలీసు అధికారులు కక్ష్యపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు ఎడిజిపిని కోరారు.

జిఒ 29 రద్దుకు చొరవ

- గవర్నర్‌కు బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జిఒ 29 రద్దుకు చొరవ చూపాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆ సంఘం నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఐఎఎస్ అధికారి చిరంజీవులు తదితరులు గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. జిఒ 29 వల్ల బిసిలకు జరుగుతున్న అన్యాయంపై ఆయనకు వివరించారు. ఈ జిఒ వల్ల అగ్రవర్ణాలు ఉద్యోగాల్లో లబ్ధిపొందుతారని ఆందోళన వ్యక్తం చేశారు. బిసిలకు అన్యాయం చేసే జీవో నెంబర్ 29 రద్దుచేసిన తర్వాతే గ్రూప్ వన్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

త్వరలో సమగ్ర కుల గణన సర్వే

- బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో త్వరలో సమగ్ర కుల గణన సర్వే నిర్వహించనున్నట్టు బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఎనిమిది వరకు ఉమ్మడి జిల్లాల్లో బిసి కమిషన్ పర్యటిస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరిస్తామని తెలిపారు. సమగ్ర సర్వే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వివరించినట్టు పేర్కొన్నారు. అలాగే కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సమగ్రంగా సేకరించిన కులాల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన వెల్లడించారు.

చిన్న నగరాల్లో నివాస అమ్మకాలు పతనం

- టాప్ 30 టైర్2 సిటీల్లో వెలవెల
- 3-61 శాతం వరకు క్షీణత
- విజయవాడ, వైజాగ్‌లోనూ అంతంతే
- ప్రాప్‌ఈక్విటీ రిపోర్ట్ వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో నివాస అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి. ప్రస్తుత ఏడాది జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఇళ్ల అమ్మకాలు 13 శాతం పతనమై 41,871 యూనిట్లుగా నమోదయ్యాయని ప్రాప్‌ఈక్విటీ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 47,985 యూనిట్ల ప్రాపర్టీల అమ్మకాలు జరిగాయి. కేవలం కోయంబత్తూరు, డెహ్రాడూన్‌లలో మాత్రం అమ్మకాలు వరుసగా 23 శాతం, 47 శాతం చొప్పున పెరిగాయి. ఈ రిపోర్ట్ ప్రకారం.. గడిచిన క్యూ3లో నూతన నిర్మాణాలు (లాంచ్) ఏకంగా 34 శాతం క్షీణించి.. 28,980 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఇవి 2023 ఇదే క్యూ3లో 43,748 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. కేవలం డెహ్రాడూన్, భోపాల్, కోయంబత్తూరు తదితర 8 నగరాల్లో మాత్రం కొత్త నిర్మాణాలు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. దేశంలో వెస్ట్ జోన్ మొత్తం అమ్మకాలలో అహ్మదాబాద్, వడోదర, గాంధీనగర్, సూరత్, గోవా, నాసిక్, నాగ్‌పూర్‌ల వాటా 71 శాతంగా ఉంది. కనెక్టివిటీ, మౌలిక వసతుల్లో వృద్ధి ఉన్నప్పటికీ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో టైర్-30 నగరాలు విఫలమయ్యాయని ట్రూ నార్త్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సిఇఒ రోచక్ బక్షి పేర్కొన్నారు.

ఎపిలో రియాల్టీ దిగాలు..

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన నగరాలు నివాస అమ్మకాల్లో వెనుకబడిపోయాయి. 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో గుంటూర్‌లో విక్రయాలు 35 శాతం తగ్గి 242 యూనిట్లుగా, వైజాగ్‌లో 40 శాతం పతనమై 776 యూనిట్లుగా, విజయవాడలో 21 శాతం తగ్గి 440 యూనిట్లుగా నమోదయ్యాయి. ఆయా నగరాల్లో వరుసగా గతేడాది ఇదే త్రైమాసికంలో 371 యూనిట్లు, 1296 యూనిట్లు, 557 యూనిట్ల చొప్పున అమ్మకాలు జరిగాయి. కొత్త లాంచ్‌లు వైజాగ్‌లో 87 శాతం క్షీణించి 350 యూనిట్లుగా, విజయవాడలో 69 శాతం పతనమై 150 యూనిట్లకు పరిమితమయ్యాయి.

2,349 మంది బదిలీ వర్కర్లు.. జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

- సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ ఆదేశాలు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2349 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ సిఎండి ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఏరియాలకు ఉత్తర్వుల పత్రాలను విడుదల చేశారు. కార్మికులు సింగరేణి సంస్థలో చేరినప్పటి నుంచి కేలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేశారు. 1వ తేదీ సెప్టెంబరు 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కారుణ్య నియామక ప్రక్రియ కింద సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారసులను ముందుగా బదిలీ వర్కర్లుగా గుర్తిస్తూ, సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూ గర్భంలో పనిచేయడానికి యాజమాన్యం పోస్టింగులు ఇస్తుంటుంది. ఈ విధంగా గనులకు కేటాయించబడిన బదిలీ వర్కర్లు ఏడాదిలో కనీసం 190 మస్టర్లు (పని దినాలు) పనిచేసినట్లయితే వారిని జనరల్ మజ్దూర్లుగా యాజమాన్యం గుర్తిస్తుంది. ఉపరితల గనులు, విభాగాల్లో అయితే 240 మస్టర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ ప్రక్రియకు ఏండ్ల తరబడి సమయం తీసుకుంటూ ఉండేవారు. కాగా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉద్యోగంలో చేరిన వారు ఏడాదిలో 190 మస్టర్లు పూర్తి చేయగానే ప్రమోషన్ ఇవ్వాలని పర్సనల్ విభాగం అధికారులను ఆదేశించారు. సింగరేణిలో ఒకేసారి 2349 మందిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అంకిత భావం, క్రమ శిక్షణతో పనిచేయాలని సిఎండి కార్మికులకు సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 662 మంది జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగోన్నతి పత్రాలను పొందారు.

బాలసదన్‌లో బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- ఘటనను దాచిపెట్టిన అధికారులు.. కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనాథలకు రక్షణ కల్పించాల్సిన మహిళా శిశు సంక్షేమ శాఖలోనే బాలికలకు రక్షణ లేకుండా పోయింది. ఓ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో వెలుగుచూసింది. ఈ నెల 14న ఒక కార్యక్రమం నిర్వహణ పేరుతో డిసిపిఒతోపాటు మరి కొంతమంది రాత్రి 7 గంటల సమయంలో బాలసదన్‌కు వచ్చారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ బాలిక బాత్రూంకు వెళ్లి వస్తుండగా.. ఓ వ్యక్తి లైంగికదాడి చేశాడు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన బాలిక ఏడ్చుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది. గమనించిన బాలసదన్ సిబ్బంది ఆరా తీయగా ఓ వ్యక్తి తనపై లైంగికదాడి చేశాడంటూ తన శరీరంపై గాయాలను చూపించింది. వెంటనే సిబ్బంది డిసిపిఒకు సమాచారం అందించారు. సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టకపోగా విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని, చెబితే అందరి ఉద్యోగాలు పోతాయని సిబ్బందిని ఆ ముఖ్య అధికారి బెదిరించినట్టు తెలిసింది. బాలికను వలిగొండలోని ఓ ప్రయివేట్ అనాథాశ్రమానికి తరలించినట్టు సమాచారం. నిందితుడు జిల్లా లీగల్ సెర్వీసెస్‌కు చెందిన ఓ అటెండర్‌గా సమాచారం. కాగా ఆదివారం బాధితురాలు ఉన్న వలిగొండ శాంతి నిలయంలో సంబంధిత బాలసదన్ అధికారులు, కౌన్సిలర్ విచారణ జరపగా.. తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని చెప్పినట్టు తెలిసింది.

కేసు నమోదు

ఈనెల 20న బాలసదన్ సిబ్బంది ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశాల మేరకు సీడబ్ల్యూసీ కమిటీ విచారణ చేయనున్నది. ఈ సంఘటనపై అలసత్వం వహించిన అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు.

కెసిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎర్రవెల్లిలోని ఫాం హౌజ్‌లో కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఊరుకోం

- ముత్యాలమ్మ గుడి ఘటనపై సిఎం హెచ్చరిక
- పోలీసులకు భారీగా పరిహారం పెంపు
- ట్రాఫిక్ నియంత్రణకు ఎఐ కూడా వినియోగిస్తాం
- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తూ ఉన్మాదంతో మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరంచారు. సోమవారం ఘోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ ఫ్లాగ్ డే కార్యక్రమానికి సిఎం ముఖ్య అతిధిగా విచ్చేసి ప్రసంగించారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భగా సిఎం మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, ఇందుకు ఎవరు మోకాలొడ్డినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. ముత్యాలమ్మ గుడి సంఘటనలో దోషులను అరెస్టు చేశామని చెప్పారు. నిందితులను తామే శిక్షిస్తామంటూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేవారిని ఎలా అనుమతిస్తామని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ రవాణా, వినియోగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో అనేక మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని ఆయన కొనియాడారు. ఈ నేపథ్యంలో వారికి ఇస్తున్న పరిహారాన్నీ భారీగా పెంచుతున్నామని సిఎం ప్రకటించారు. కానిస్టేబుల్, ఎఎస్‌ఐ స్థాయి వరకు కోటి రూపాయలు, ఎస్‌ఐ నుంచి సిఐ వరకు రూ. కోటి 25 లక్షలు, డిఎస్‌పి నుంచి అదనపు ఎస్‌పి వరకు రూ. కోటి 50 లక్షలు, ఎస్‌పి ఆపై స్థాయి అధికారులకు రూ. రెండు కోట్ల వరకు చెల్లిస్తామని తెలిపారు. శాస్వత అంగవైకల్యం పొందినవారిలో కానిస్టేబుల్ నుంచి సిఐ వరకు రూ. 50 లక్షలు, డిఎస్‌పి నుంచి అదనపు ఎస్‌పి వరకు రూ. 60 లక్షలు, ఎస్‌పి ఆపై స్థాయి అధికారులకు కోటి రూపాయలు చెల్లిస్తామన్నారు. ఇంకా తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ నుంచి సిఐ వరకు రూ. 50 లక్షలు, డిఎస్‌పికి రూ. 10 లక్షలు, ఆపై స్థాయి అధికారులకు రూ.12లక్షల వరకు నష్ట పరిహారం పెంచినట్లు సిఎం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి భోజనం తగిన వసతి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. పోలీసు పిల్లల భవిష్యత్తు కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను 50 ఎకరాల్లో నెలకొల్పుతున్నట్లు తెలిపారు. హోంగార్డు నుంచి డిజిపి స్థాయి అధికారి వరకు వారి పిల్లలకు అత్యుత్తమ విద్యనందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే తానే స్వయంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో పోలీసు అధికారులు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా అధికారులు విరివిగా ఉపయోగించాలని సిఎం సూచించారు. రాష్ట్ర డిజిపి జితేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. వారిలో రాష్ట్రానికి చెందిన గ్రేహౌండ్స్‌కు చెందిన కానిస్టేబుల్ కూడా ఉన్నారన్నారు. విధినిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లను సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ డిసిపి చదవగా సాయుధ పోలీసులు అమరుల స్థూపానికి వందన సమర్పణ చేశారు. ఈసందర్భంగా పలువురు సీనియర్ ఐపిఎస్ అధికారులు, మాజీ డిజిపిలు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు.



పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

రూ.10 నాణేలు చెల్లుతాయ్

ఇండియన్ బ్యాంక్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - హైదరాబాద్



రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయని ఇండియన్ బ్యాంక్ ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతోంది. దీనిపై తెలుగు రాష్ట్రాల్లోని తమ 480 శాఖల్లో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్‌లు చేపడుతున్నామని ఆ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎస్ శ్రీనివాస రావు తెలిపారు. నాణేం చెల్లదనే అపోహలు వీడాలన్నారు. తక్షణ చిల్లర చెల్లింపుల కోసం ఈ నాణేలు చాలా సౌకర్యంగా ఉంటాయన్నారు.

రూ.10 నాణేలపై బిఒబి క్యాంపెయిన్

రూ.10 నాణేల చెల్లుబాటుపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించడానికి ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బిఒబి) ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించింది. ఈ క్రమంలోనే సోమవారం బిఒబి హైదరాబాద్ మెట్రో రీజియన్ ప్రజలకు రూ.10 పంపిణీ చేసింది. ఈ ప్రాంతంలోని 43 శాఖల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టింది.

ఆరోగ్యమిత్రల వేతనాల పెంపు

- మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆరోగ్యమిత్రల వేతనాలను వెంటనే పెంచాలనీ, క్యాడర్‌ను మార్పు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయూ- సిఐటియు అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ఆరోగ్యశ్రీ హైదరాబాద్ అధ్యక్షులు టి రాజు తదితరులు మంత్రి దామోదర రాజనర్సింహకు, ట్రస్ట్ సిఇఒకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ (ఎఫ్‌ఎసి) ఆర్‌వి కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్యమిత్రల క్యాటగిరీలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ (డిపిఒ) క్యాటగిరీలోకి మార్చాలని, వేతనం రూ.22,750కు పెంచాలని కోరినా ప్రభుత్వ స్పందన ఆలస్యం కావడంతో ఆగస్టు 6న సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లగా, సెప్టెంబర్ 20న ప్రభుత్వం హామీ పత్రం ఇచ్చిందని గుర్తుచేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌లోకి మార్పుతో పాటు వేతనం రూ.19,500 పెంచుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అణలు, సమ్మె చేసిన మూడ్రోజులు వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా సమ్మె నోటీస్‌లోని మిగిలిన డిమాండ్లు ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించడం, ఎనిమిది గంటల పనిదినం అమలు, ఎఫ్ఆర్ఎస్ సమస్య, హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం, చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాల పట్ల చర్చల సమయంలో సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని వారు కర్ణన్‌కు విజ్ఞప్తి చేశారు.

ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- రూ.20 లక్షలతో జిపి భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎవరు అడ్డుపడినా మూసీ నది ప్రక్షాళన ఆగదని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు నడుం బిగించగా.. ప్రతిపక్షాలు అనవసరంగా అడ్డుపడుతున్నాయన్నారు. ఏదేమైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ. కోటితో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయాల భవనాలను ఒక్కొక్కటి ఎకరం స్థలంలో నిర్మిస్తామని చెప్పారు. అవసరమైతే మరిన్ని ప్రత్యేక ఫండ్స్ మంజూరు చేయించి మూడు కార్యాలయాలను పూర్తి చేస్తామన్నారు. రూ. రెండు లక్షలలోపు రుణాలు ఉన్న వారికి రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. రెండు లక్షల కన్నా పైన ఉన్నవారి రుణాలకు సంబంధించి రెండు లక్షలను డిసెంబర్ ఏడు లేదా తొమ్మిదిన మాఫీ చేస్తామని చెప్పారు. రూ.నాలుగు కోట్లతో చెరుపల్లి, తిప్పర్తి రోడ్డు మంజూరు చేశామన్నారు. ఇందుగుల, తిరుమర్తి, మామిడాల, నకిరేకల్ రహదారి పనులకు రూ.60 కోట్లు మంజూరు చేశామన్నారు. కురుమర్తి నుంచి సూర్యాపేటకు డబుల్ రోడ్డు వేయనున్నామని, త్వరలోనే ఈ రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. మాడుగులపల్లికి 75 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏఎమ్మార్పీ కాలువల ద్వారా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో తన సొంత నిధులు ఖర్చు చేసి కాలువల్లో పూడిక తీత, చెట్ల తొలగింపు చేపట్టామన్నారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన ఎస్ఎల్‌బిసి సొరంగం పనులను అనుకున్న సమయంలో పూర్తి చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. అనంతరం మంత్రి గ్రామశివారులో ఉన్న నల్లకుంట చెరువు నుంచి కాల్వలకు వెళ్లే నీటి మోటార్లకు స్విచ్ఛాన్ చేశారు. కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, నల్గొండ ఇన్‌చార్జి ఆర్‌డిఒ శ్రీదేవి, డిపిఒ మురళీ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ సత్యనారాయణరెడ్డి, డిఇ గణేష్, పంచాయతీ కార్యదర్శి కాసిం, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జిఒ 29 రద్దు కోసం కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జిఒ 29ను రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. రిజర్వేషన్‌పరంగా దళిత, గిరిజన బలహీనవర్గాలు పొందాల్సిన ఉద్యోగాలను అగ్రకులాలకు అప్పజేప్పడమే ఈ జిఒ లక్ష్యమని పేర్కొంది. ఈ మేరకు సోమవారం కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జాన్‌వెస్లీ టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను జిఒ 55 ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 29 ప్రకారం రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థి జనరల్ కోటాలో ఎంపికైనా రిజర్వు కోటాగానే పరిగణిస్తారని తెలిపారు. దీంతో ఇతర రిజర్వుడ్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని గుర్తు చేశారు. జిఒ 29ను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

షాప్సీలో బిగ్ దీపావళి సేల్


బెంగళూరు : కొనుగోలుదారులను ఆకర్షించడానికి బిగ్ దీపావళి విక్రయాలను ఆవిష్కరించినట్లు ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన షాప్సీ వెల్లడించింది. ప్రస్తుత పండగ సీజన్‌లో వినియోగదారుల్లో 81 శాతం పెరుగుదలతో.. లావాదేవీలు 2.8 రెట్ల వృద్ధి చోటు చేసుకుందని పేర్కొంది. విస్తరమైన పోర్టుపోలియో ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది.

నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

- బంధువులు, విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా
- కళాశాల అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దసరా సెలవుల అనంతరం కళాశాల హాస్టల్‌కు తిరిగి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకెళ్తే.. మెదక్ జిల్లా జహీరాబాద్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మయ్య కుమార్తె అనూష. ఆమె నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని నారాయణ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల దసరా సెలవులకు ఆమె ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం అనూషను తల్లిదండ్రులు కళాశాలలో వదిలి వెళ్లిపోయారు. ఇంటికి చేరుకున్న కొన్ని గంటల్లోనే వారికి కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చింది. అనూష స్పృహ తప్పి పడిపోయిందని, త్వరగా కళాశాలకు రావాలని చెప్పారు. తల్లిదండ్రులు ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటలకు కళాశాలకు వచ్చారు. అక్కడికొచ్చాక.. అనూష హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని యాజమాన్యం చెప్పింది. అయితే, అప్పటికే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దాంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మధ్యాహ్నమే అమ్మాయిని పంపించామని, ఇంతలోనే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుందని ప్రశ్నించారు. తాము వచ్చేలోపే ఎందుకు గాంధీకి తరలించాలని నిలదీశారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోమవారం అనూష కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద నిరసన తెలిపాయి. ఈ క్రమంలో కొందరు కళాశాల అద్దాలు, కొంత ఫర్నీచర్ ధ్వంసం చేశారు. బాచుపల్లి పోలీసులు వారిని శాంతింపజేసి పూర్తి విచారణ చెప్పడతామని తెలిపారు. సిఐ జె ఉపేందర్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.



25 నుంచి నారెడ్కో ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ వర్గాల అసోసియేషన్ నారెడ్కో హైదరాబాద్‌లో ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తోన్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 25 నుండి 27 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తోన్నట్లు నారెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ విజయ సాయి మేకా, సెక్రటరీ జనరల్ కె శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలో ఆ సంస్థ ట్రెజరర్ ఆర్ వెంకటేశ్వర రావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్‌వై కిరణ్‌లతో కలిసి వారు మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రాపర్టీ షోలో రెరా ఇతర ప్రభుత్వ రెగ్యులేటరీ అనుమతులు ఉన్న క్లియర్ ప్రాపర్టీలను మాత్రమే ప్రదర్శనకు ఉంటాయన్నారు. 100 మంది డెవలపర్లు తమ అనేక ప్రాజెక్టులను ఇక్కడ అందుబాటులోకి తేనున్నారని విజయ సాయి, శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఐదు ఫైనాన్స్ సంస్థలు, మరో ఐదు సప్లయి సంస్థలు భాగస్వామం అవుతున్నాయని వెల్లడించారు.

అనుమతులున్న వాటిని హైడ్రా కూల్చలేదు

హైదరాబాద్ రియాల్టీకి ఢోకా లేదని విజయ సాయి, శ్రీధర్ రెడ్డి అన్నారు. అన్ని అనుమతులు కలిగిన ప్రాపర్టీలను హైడ్రా ఎక్కడ కూల్చలేదని తెలిపారు. హైడ్రా కూల్చివేతలపై కొన్ని సోషల్ మీడియాల్లో తప్పుడు వార్తలు వస్తోన్నాయని అన్నారు. దీనిపై సిఎం రేవంత్ రెడ్డి కూడా స్పందించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. రియాల్టీ ప్రస్తుతం కొంత స్తబ్దతలో ఉన్నప్పటికీ తొందరలోనే పుంజుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించిందని.. దీంతో రియల్ ఎస్టేట్‌కు మరింత మద్దతు లభించనుందన్నారు. నగరం ఒక్క సారి గ్లోబల్ సిటీగా అవతరిస్తే.. ఆ అభివృద్ధిని ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు.

ఇండెల్ మనీ రూ.150 కోట్ల ఎన్‌సిడిల జారీ

న్యూఢిల్లీ : పసిడి రుణాల జారీ సంస్థ ఇండెల్ మనీ వ్యాపార వృద్ధి కోసం నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి)లను జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. వీటితో రూ.150 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 4 వరకు ఈ ఇష్యూ తెరిచి ఉంటుందని.. ఇంతలో పరిమితి మించి సబ్‌స్క్రిప్షన్ నమోదయితే అప్పుడే ఇష్యూను ముగించనున్నట్లు తెలిపింది. ఏడాదికి 13.44 శాతం వడ్డీ రేటును అందించనున్నట్లు వెల్లడించింది. తమ పోర్టుపోలియోలో 91.82 శాతం పసిడి రుణాల వాటా ఉందని తెలిపింది.

ఫోన్‌పే ఉద్యోగులకు ఎఐ ఎసరు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పేలో కృత్రిమ మేధా (ఎఐ) ఆ సంస్థ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపింది. ఫోన్‌పే తన కస్టమర్ సపోర్ట్ స్టాఫ్ కార్యకలాపాల్లో 90 శాతం ఎఐ చాట్‌బాట్‌లను వాడుతోంది. దీంతో గత ఐదేళ్లలో కస్టమర్ సపోర్ట్ విభాగంలో 60 శాతం మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. గతంలో ఈ విభాగంలో ఉన్న 1,100 మంది ఉద్యోగులను 400కు పరిమితం చేసింది.

మహిళలు ఈ దేశ పౌరులే..

- ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, వికె శ్రీమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ దేశంలో ఉన్న మహిళలు దేశ పౌరులు కాదా? అని ఐద్వా జాతీయ అధ్యక్షులు మరియం ధావలే ప్రశ్నించారు. సోమవారం కొత్తగూడెంలో ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రోజు రోజుకు ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటిని తట్టుకోవటం సామాన్యులకు సాధ్యం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్న తర్వాత చేతిలో డబ్బు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి, ఇతర ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేస్తోందని చెప్పారు. పేదలు సగం కడుపు నింపుకుని ఒక్క పూట మాత్రమే తింటున్న దృశ్యాలు ఈ సర్కారుకు పట్టకపోవడం విడ్డురమని విమర్శించారు. ఆ పోరాటాల్లో మహిళల పాత్ర విడదీయలేనిదన్నారు. హక్కుల కోసం ఉద్యమించాలని, అడ్డుగోడలను బద్ధలు కొట్టాలని పిలుపునిచ్చారు. మోడీ పదేళ్ల పాలనలో మహిళల అభివృద్ధిని మరింత వెనక్కు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి బతకటానికి కూడు, గూడు, గుడ్డ కనీస అవసరమని చెప్పారు. పేదల మౌలిక అసరాలు తీర్చలేని సర్కార్ ఎవరి కోసం పని చేస్తున్నదని ప్రశ్నించారు. తినటానికి తిండి లేక, సరైన పౌష్టికాహారం లేక మహిళలు రోగాలు, నొప్పులు, రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార ధాన్యాలను సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆహార భద్రతా చట్టాన్ని అది నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. పేదలకు రావాల్సిన కనీస అవసరాలను తీర్చలేని మోడీ ప్రభుత్వం మహిళలు, దళితులు, ఇతర తరగతులపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు లౌకికత్వం కోసం, సర్వమానవ సమానత్వ ఆకాంక్షతో ఎన్నో ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని గుర్తుచేశారు. కానీ ఆ వాతావరణాన్ని బిజెపి కలుషితం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరోగమన పాలకుల విధానాలను ఎండగడుతూనే మెరుగైన సమాజాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

సాయిబాబా గొప్ప విప్లవకారుడు

- నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని ధారబోశారు : తమ్మినేని
- ఎర్రజెండాలు కలవాల్సిన రోజులొచ్చాయి : ఎమ్మెల్యే కూనంనేని
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ సాయిబాబా గొప్ప విప్లవకారుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన చనిపోలేదని, రాజ్యహింసలో హత్యకు గురయ్యాడని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ..ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయన్నారు. రాజకీయాలు పరాకాష్టకు చేరుకుని ఏ వ్యక్తి ఏ పార్టీలో ఉన్నాడో అర్థంకాని ప్రస్తుత పరిస్థితుల్లో నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన సాయిబాబా అంకితభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేననీ, ఎంచుకున్న మార్గాలు ఏవైనప్పటికీ అంతిమ లక్ష్యం ఒక్కటేనని చెప్పారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా ఎదురొడ్డి నిలబడి పోరాడే విషయంలో సాయిబాబా కృషి మరువలేనిదన్నారు. పెట్టుబడి, శ్రమ మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రస్తుతం పెట్టుబడిదే ఆధిపత్యం కొనసాగుతున్నదనీ, ఆ పెట్టుబడి ఆధిపత్యం వల్లే పాలకుల నుంచి అహంకారపూరిత మాటలు వస్తున్నాయని వివరించారు. అలాంటి కోవలోకే అమిత్‌షా మాటలు వస్తాయన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ ఎల్పీ నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నిర్దోషైన సాయిబాబా పదేళ్ల పాటు జైలులో అత్యంత దుర్భర జీవితాన్ని గడపడానికి కారణమైన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. ఇది చట్టాల లోపమా? పాలకుల మనస్సులో గూడుకట్టుకున్న విషమే కారణమా? అని నిలదీశారు. ఒక ప్రొఫెసర్‌కు జైలులో కనీస సౌకర్యాలు కల్పించకపోవడమేంటి? తల్లి చనిపోయినా బయటకు పంపకపోవడమేంటి? ఎన్నికల్లో లబ్ది పొందేందుకు డేరాబాబాను పెరోల్‌మీద బయటకు తీసుకురావడమేంటి? బిల్కిస్‌బానో లైంగిక దాడి కేసులో శిక్ష అనుభవించిన వారిని పూలదండలు వేసి ఊరేగించడమేంటి? అసలు మనం ఏ సమాజంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాయిబాబా 90 శాతం వైకల్యంతో తాను నడవలేకున్నా సమాజానికి నడక నేర్పారని, ఆయన జీవితం ఒక ప్రయోగమని కొనియాడారు. చట్టబద్ధ పాలన చేస్తున్న దేశాలే అభివృద్ధి చెందుతాయన్న మాట చెప్పిన వ్యక్తికి నోబెల్ బహుమతి వచ్చిందని గుర్తుచేశారు. ఆయన్ను జైలు నుంచి బయటకు తీసుకురావడానికి దేశంలోని ఎంతో మంది మేధావులు శక్తికిమించి కృషి చేశారన్నారు. కానీ, పదేళ్ల జైలు జీవితంలో ఆయన దేహం మొత్తం క్షీణించి బయటకు వచ్చిన కొద్ది కాలంలోనే మరణించారని వాపోయారు.

రచయిత్రి మీనా కందసామి మాట్లాడుతూ.. సాయిబాబాను కలిస్తే ఎక్కడలేని రాజకీయ చైతన్యం, ఉత్తేజం వచ్చేదని గుర్తుచేసుకున్నారు. చత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు తీసుకొచ్చిన గ్రీన్‌హంట్‌ను ప్రశ్నించినందుకే సాయిబాబాపై రాజ్యం కక్షగట్టి ఉపా చట్టం కింద పదేళ్ల జైలు జీవితం గడిపించిందని తెలిపారు. రాజ్యాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా నేటి పాలకులు అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్న తీరును ఎండగట్టారు.

వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాయిబాబా జీవన నేపథ్యం, తన జీవితంలో రూపొందించిన ఉద్యమాలు, ఆయనపై రాజ్యం మోపిన ఉక్కుపాదం గురించి వివరించారు. ఆదివాసీలపై కేంద్రంలోని పాలకులు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆనకొండ, కాగర్‌లకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడారన్నారు. ఏ తప్పు చేయని సాయిబాబాపై 950 పేజీల జడ్జిమెంట్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. సాయిబాబాకు శిక్ష విధించిన జడ్జి తర్వాతి కాలంలో మహారాష్ట్రంలో 700 మంది ప్రాసిక్యూటర్లకు ఇన్‌చార్జిగా నియమితులయ్యారని తెలిపారు. తప్పుడు జడ్జిమెంట్‌ను ప్రశ్నించిన వారిపైనా ఉపాకేసులు పెట్టి కేంద్ర ప్రభుత్వం వేధిస్తున్నదన్నారు. ఆయన అసంపూర్తిగా వదిలేసి పోయిన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలనీ, ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా పోరాడాలనీ, ఆదివాసీలపై పాలకుల యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్ని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో సాయిబాబా సతీమణి వసంత, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సరోజ్‌గిరి, వేములపల్లి వెంకట్రామయ్య (సిపిఐఎంఎల్-న్యూడెమోక్రసీ), విమలక్క (టఫ్), సంధ్య (పిఒడబ్ల్యు), మామిండ్ల రమేశ్‌రాజా (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్), జానకిరాములు (ఆర్ఎస్‌పి), సదానందమ్ (మాస్‌లైన్), ప్రసాద్ (సిపిఐ(ఎంఎల్)), గోవర్ధన్ (సిపిఐ(ఎంఎల్)-న్యూడెమోక్రసీ), నందిని సిద్దారెడ్డి (ప్రముఖ కవి), జిలకర శ్రీనివాస్ (విసికె), పాణి (విరసం) మాట్లాడారు. సాయిబాబా మృతికి సంతాపం తెలుపుతూ ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన సందేశాలను ఆయన కుమార్తె మంజీర, దేశంలో ప్రముఖుల సందేశాలను ఆయన తమ్ముడు రాందేవ్ చదివి వినిపించారు. సంస్మరణ సభ అధ్యక్షవర్గంగా ప్రొఫెసర్ జి లక్ష్మణ్ (పౌరహక్కుల సంఘం), ఎం రాఘవాచారి (నిర్బంధ వ్యతిరేక వేదిక), పద్మకుమారి (బంధుమిత్రుల సంఘం), అరసవెల్లి కృష్ణ (విరసం), కె రవిచందర్ (నిర్బంధ వ్యతిరేక వేదిక), బి జ్యోతి (చైతన్యమహిళా సంఘం) వ్యవహరించారు.

డిసెంబర్‌లో బ్రహ్మపుత్ర వ్యాలీ ఫిల్మ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - హైదరాబాద్

బ్రహ్మపుత్ర వ్యాలీ ఫిల్మ్ ఫెస్టివల్ (బివిఎఫ్ఎస్) 9వ ఎడిషన్‌ను ఈ ఏడాది డిసెంబర్ ఐదు నుండి ఎనిమిది వరకు గౌహతిలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ తనుశ్రీ హజారికా తెలిపారు. ఈ సంవత్సరం ఈశాన్య ప్రాంతం వెలుపలి నుండి శక్తివంతమైన కథలను ప్రదర్శిస్తూ, చలనచిత్రాల ఎంపికతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దీన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 220 కంటే ఎక్కువ ఫిల్మ్ ఎంట్రీలు వచ్చాయని. ఫెస్టివల్ పోటీ, పోటీయేతర విభాగాలలో చలనచిత్రాల ఎంపికను ప్రదర్శించనున్నామన్నారు. ఫీచర్ ఫిల్ములు, డాక్యుమెంటరీలు షార్ట్ ఫిల్ములు వంటి విభాగాలను కలిగి ఉంటుందన్నారు. 2023లో జరిగిన చివరి ఎడిషన్‌కు 25,000 కి పైగా మంది హాజరయ్యారన్నారు.

వరస్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌గా ధృవ తోట

ప్రజాశక్తి - హైదరాబాద్

వరాస్ మొదటి ఇంటర్నేషనల్ రాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ధృవతోట ఛాంపియన్‌గా నిలిచారు. హైదరాబాద్ జిపి బిర్లా సెంటర్‌లో నిర్వహించిన చెస్ టోర్నమెంట్‌లో 494 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తం 10 విభాగాల్లో 98మందికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలను చేవెళ్ల ఎంపి కండా విశ్వేస్వరరెడ్డి,ఐపిఎస్ అధికారి రాజశేఖర్ అభినందించారు.



అమ్జద్ హబీబ్ సలోన్స్‌లో శ్రద్ధదాస్ సందడి

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలోని నల్లగండ్లలో ఏర్పాటు చేసిన అమ్జద్ హబీబ్ సలోన్స్ ఫ్రాంచైజీని సినీనటి శ్రద్ధదాస్ ప్రారంభించి.. సందడి చేశారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడు అమ్జద్ హబీబ్ మాట్లాడుతూ.. తమ సలోన్స్ విజయవాడ, మియాపూర్, ఇప్పుడు నల్లగండ్లలో ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల వ్యాపార విస్తరణ కోసం ప్రణాళికలు ఉన్నాయన్నారు. చంచల్‌గూడ జైల్లో ఖైదీలకు ట్రైనింగ్ ఇస్తున్నానని తెలిపారు.